తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వరుడు

## శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరుని కల్యాణోత్సవం

వడమాలపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:
అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరుని ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున స్వామివారికి కల్యాణం జరిపించడం ఆనవాయితీ. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, పూలమాలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు ఆధ్వర్యంలో అగ్నిహోమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ వేదమంత్రాలతో మాంగళ్యధారణ చేయించారు. మహా మంగళ హారతులు ఇచ్చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

### ఉమ్మడి చిత్తూరుజిల్లాలో

## రేపటినుంచి చంద్రబాబు పర్యటన

### ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిశీలన.. పూతలపట్టు.. శ్రీకాళహస్తిలో బహిరంగ సభలు !!



కుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త
తెదేపా అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు ఈనెల 4,5వతేదీల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లా, అన్నమయ్య జిల్లా మదనపల్లిలో పర్యటించనున్నారు. 4వతేది శుక్రవారం ఉదయం 11గంటలకు చంద్రబాబునాయుడు అన్నమయ్య జిల్లా మదనపల్లి వద్ద గల స్థానిక ఇరిగేషన్ ప్రాజెక్టులను సందర్శించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు మదనపల్లి నుంచి పీలేరు మీదుగా ఉన్న పలమనేరు బ్రాంచ్ కెనాల్ కాలువను పరిశీలి ంచనున్నారు. మధ్యాహ్నం 1.30గంటలకు పలమనేరు చేరుకుని కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పరిశీలిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కేంద్రం చిత్తూరులో మీడియా, పార్టీ నేతలతో సమావేశమవుతారు. 4.30గంటలకు చిత్తూరునుంచి బయలుదేరి 5గంటలకు పూతలపట్టుకు చేరుకు ని రోడ్‌షో నిర్వహిస్తారు. సాయంత్రం 5.30గంటలకు పూతలపట్టులో జరిగే బహిరంగసభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం రాత్రికి పూతలపట్టులోనే బస చేస్తారు. 5వతేది శనివారం ఉదయం 9గంటలకు పూతలపట్టునుంచి బయలుదేరి తిరుపతికి చేరుకుంటారు. తిరుపతిలోని బాలాజీ రిజర్వాయర్‌ను10.30గ ంటలకు పరిశీలించనున్నారు. 11.30గంటలకు శ్రీకాళహస్తికి చేరుకుని రోడ్‌షోలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12గంటలకు శ్రీకాళహస్తిలో జరిగే బహిరంగసభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.30గంటలకు శ్రీకాళహస్తి నుంచి బయలుదేరి నెల్లూరుకు 3.45గంటలకు చేరుకుంటారు. 4.15గంటలకు నెల్లూరులో మీడియా, పార్టీ నేతలతో సమావేశమవుతారు. శనివారం రాత్రికి నెల్లూరులోనే ప్రతిపక్ష నేత చంద్రబాబు బస

## ఇనోవా ఢీకొని విద్యార్థి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నవీన్

వడమాలపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:
స్కూటర్‌పై ఇంటికి వెళుతున్న విద్యార్థిని ఇనోవా కారు బలంగా ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వడమాలపేట మండల పరిధిలోని పాదిరేడు రోడ్డు వద్ద బుధవారం జరిగింది. బాధితుల, పోలీసుల కథనం మేరకు.... పాదిరేడు దళితవాడకు చెందిన తడుకు నవీన్(21) డిగ్రీ ఫైనల్ ఇయర్‌చదువుతున్నాడు. బుధవారం 3 గంటలకు వడమాలపేట నుంచి స్కూటర్‌పై ఇంటికి వెళుతూ పాదిరేడు వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి తిరుపతికి వెళుతున్న ఇనోవా బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇనోవా లోని వారు వాహనాన్ని వదలి పరారయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు రోడ్డుపైకి వచ్చి వాహనాలను నిలిపి వేసి ఆందోళన చేశారు. దీంతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పుత్తూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి శాంతింపచేశారు. పాదిరేడు సర్కిల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయిస్తానని, మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని పుత్తూరుకు తరలించారు. వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### దేశ ఆర్థిక వ్యవస్థలో

## ఉక్కు తయారీదారుల పాత్ర కీలకం




### -2030 నాటికి ఉక్కు సామర్థ్యం 300 మిలియన్ టన్నులు
### -స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ నీరభ్ కుమార్ ప్రసాద్

తిరుపతిరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:
భారతదేశ ప్రజల ఆకాంక్ష తీర్చడానికి, దేశ 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చటానికి దేశంలోని ఉక్కు తయారీదారులు కీలక పాత్ర పోషించాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్ కుమార్ ప్రసాద్ సూచించారు. బుధవారం ఒ హోటల్‌లో "సిఐఐ ఆంధ్రప్రదేశ్ స్టీల్ అండ్ అల్లాయ్స్"పై కాన్ఫరేన్స్ జరిగింది. ఈ కాన్ఫరేన్స్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ మరికొన్ని సంవత్సరాలలో ప్రధానమైన 'మేక్ ఇన్ ఇండియా' ఆత్మ నిర్బర్ కార్యక్రమాలు క్రింద ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం 2030 నాటికి సంవత్సరానికి 300 మిలియన్ టన్నులు, 2047 నాటికి దాదాపు 50 మిలియన్ కి పెరుగుతుందని అంఛనా వేయబడిందని, ఆర్థిక వృద్ధి కారణంగా డిమాండ్‌లో స్థిరమైన పెరుగుదలకు ఆజ్యం పోషిస్తుందన్నారు. సిఐఐ మాజీ చైర్మెన్ మిస్టర్ విజయ్‌నాయుడు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఉత్పత్తిని పెంపోందించటానికి, ఇంధన వినియోగం తగ్గించటానికి, ఉక్కు పదార్థాలను ఉత్పత్తి చేయడానికి నిరంతర సాంకేతిక పురోగతులను చవి చూసిందన్నారు. ఆటో మేషన్, డేటా, అనలిటిక్స్, ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ యొక్క స్వీకరణ జరుగుతుందన్నారు. ఉక్కు తయారీ ప్రక్రియలలో మేధస్సు పెరుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోటీగా మారేందుకు నాణ్యత, సమయానుకూల డెలవరీపై దృష్టి సారిస్తూ అదే సమయంలో ధరల స్థోమతపై వివరించారు. ఆర్థిక వృద్ధి, రియల్టేట్ అభివృద్ధి, మౌళిక సదుపాయాల పెరుగుదల కారణంగా భారతమాల, సాగరమాల పునరుజ్జీవనం, పట్టణ పరివర్తన కోసం, అటల్ మిషన్, జాతీయ పెట్టుబడులు, తయారీ జోన్, స్మార్ట్ సిటీ ఏర్పాటు వంటి పథకాలతో పాటు ఉక్కు పరిశ్రమ వృద్ధి కలిగి ఉందన్నారు. హరిత సాంకేతికతలు, పునరుత్పాదకత ఇంధన వనరులను స్వీకరించడం వలన పరిశ్రమ యొక్క పర్యావరణ ప్రభావం తగ్గించవచ్చునని తెలిపారు. ఏరియా ఉక్కు ఉత్పత్తి దిశగా పరిశ్రమ పరివర్తన చెందాలన్నారు. ఈ కాన్ఫరేన్స్‌లో ఎన్‌ఎండిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కె. పాధి, సీనియరఖ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ ప్రకాష్, సీపియర్ వైస్ ప్రెసిడెంట్ హరిబాబు ఉపాధ్యాయ, బాధల్ బల్చందానీ, శ్రీధర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పథకం పారదర్శకం

### - మంత్రి రోజా



గర్భిణీలకు, బాలింతలకు సంపూర్ణ కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

నగరి, ఆగస్టు 2 ప్రభాతవార్త:
అందించే ప్రతి పథకం పారదర్శకం అని మంత్రి రోజా అన్నారు. బుధవారం నగరి మున్సిపాలిటీ చింతలపట్టెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణలో భాగంగా ఏర్పాటు చేసిన టెక్‌హోం రేషన్‌కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 611 మంది గర్భిణీలకు, 437 మంది బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడుపులోని బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రభుత్వం సంక్షేమాన్ని అమలు చేస్తున్న సంక్షేమాన్ని అభినందించకుండా ఏ మహిళా ఉండదన్నారు. సొంత అన్నదమ్ములా వారికి ఏమి కావాలని ఆలచించి ఆయన తీసుకున్న నిర్ణయాలు చూస్తే ఆశ్చర్యం వేస్తుందన్నారు. 3 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, 500 గ్రాముల నూనె, 5 లీటర్ల పాలు, 25 గుడ్లు, 2 కేజీల రాగి పిండి, ఒక కేజీ అటుకలు, బెల్లం 250 గ్రాములు, చిక్కీలు 250 గ్రాములు, ఖర్జూరం పండ్లు250 గ్రాములు అంటూ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణలో భాగంగా ప్రతి బాలింతకు, గర్భిణీకి ప్రభుత్వం అందిస్తోందన్నారు. పూర్తిగా పౌష్టికాహారమైన వీటిని బాలింతలు, గర్భిణులే తీసుకోవాలని గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు మింగేసిన విధంగా ఇవి పక్కదారి పట్టకూడదని ఫేస్ స్కానింగ్ ద్వారా పారదర్శకంగా వారికే సరకులు అందిస్తున్నారన్నారు. వీటిని తిని గర్భిణీలు, బాలింతలు వారి ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలన్నారు. అప్పుడే వారి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రక్తహీనత కారణంగా పలువురు చిన్నారులు మరణించారని అలా జరగకుండా బావితరంలో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడాలన్న ముందు చూపుతో జగనన్న ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సృజన, సీడీపీవో కృష్ణవేణి, మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, డా. కార్తీక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, కౌన్సిలర్లు ఇంద్రయ్య, నళిని, కో-ఆప్షన్ సభ్యులు ఆనందకుమార్, ఎల్లప్పరెడ్డి, కృష్ణమూర్తి, పార్టీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### గణనాధుని సేవలో

## దేవాదాయ-శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



కాణిపాకం, ఆగస్టు 2 ప్రభాతవార్త:
రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.కరికాల వలవన్ బుధవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ కార్యదర్శికి వేద మంపడపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్,కరికాల వలవన్ పరిశీలించారు. ఈసందర్భంగా భక్తుల సౌకర్యార్థం జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అలాగే ఇటీవల కె.పట్నం గ్రామ సమీపంలోని 6 లేన్ వద్ద ప్రభుత్వం కేటాయించిన 18.06 ఎకరాల భూమిని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏసీ కస్తూరి, జిలా అసిస్టెంట్ కమీషనర్ ఏకాంబరం, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ రంగస్వామి, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష విజయవంతం

### జిల్లాలో 456053 ధృవీకరణ పత్రాలు ఉచితంగా పంపిణీ చేశాం
### కలెక్టర్ వెంకటరమణ రెడ్డి



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 2, ప్రభాతవార్త
ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి తెలిసో, తెలియకో ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందని వారిని వారిని గుర్తించి ఆ కుటుంబాలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో గత మాసం జులైలో నెలపాటు నిర్వహించి స్వయంగా ప్రతి ఇంటి వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి బుధవారం తెలిపారు. జిల్లాలో 481 గ్రామ, 210 వార్డు సచివాలయాల (691) పరిధిలో వాలంటీర్లు, అధికారులు, సిబ్బంది కలసి 643863 గృహాలను (90.42 శాతం) సందర్శించి జగనన్న సురక్షలో సూచించిన 11 రకాల సేవలకు ఎలాంటి సర్వీస్ చార్జీలు లేకుండా ఉచితంగా 4,56,053 అవసరమైన సర్టిఫికెట్లు సచివాలయ పరిధిలో క్యాంపులు నిర్వహించి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అందజేశారని తెలిపారు. అర్హతలేని కారణంగా 4325 దరఖాస్తులు తిరస్కరిస్తూ, తిరస్కరించిన వాటి వివరాలు దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా వివరించారని తెలిపారు. మరో 8961 అభ్యర్ధనలు పరిశీలన దశలో వున్నాయని తెలిపారు. ఆదాయ ధృవపత్రాలు 219923, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ 478, జనన, మరణ ధ్రువపత్రాలు 20, కొత్తరేషన్ కార్డులు 385, స్ప్లిట్ రేషన్ కార్డులు 92, ఒన్ ఒన్‌బి 9994 అడంగల్‌లు 5188 మ్యుటేషన్లు 04, కుటుంబ సభ్యుల స్ప్లిట్ 160 ఇలా అవసరమైన ధ్రువ పత్రాలు టాక్స్‌ఫోర్స్, స్పెషల్ ఆఫీసర్లు, పర్యవేక్షణ అధికారుల నియామకంతో, ప్రజా ప్రతినిధుల సహకారంతో కనీస సౌకర్యాల ఏర్పాటుతో క్యాంపులు నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించగలిగామని వివరించారు.

## శ్రీకాళహస్తి కొత్త కమిషనర్‌గా రమేష్‌బాబు

శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త



:కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా రమేష బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్ళ పాటు డెప్యూటేషన్‌పై వచ్చిన బాలాజి నాయక్ మున్సిపాలిటిని అభివృద్ధి పథకంలో నడిపారు. కొత్తగా నియమితులైన కమిషనర్ రమేష్‌బాబుకు బాధ్యతలను బాలాజి నాయక్ అప్పగించారు. రమేష్‌బాబు గతంలో రెండేళ్ళ పాటు ఇక్కడ కమిషనర్‌గా పని చేసారు. మున్సిపాలిటి అభివృద్ధికి ఎంతో కృషి చేసారు. నేడు మున్సిపాలిటి ఆవరణ అందంగా ఉందంటే అది కేవలం రమేష్‌బాబు కృషియే. అంతేకాక పానగల్‌లో డివైడర్లు ఏర్పాటు చేయటంలో ప్రణాళికా బద్దంగా పని చేసారు. బుధవారం రమేష్‌బాబు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబు స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిని కలిసి సత్కరించారు. కాగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ రమేష్‌బాబును రెవెన్యూ అధికారి పిఎంవి నారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రవికాంత్, బాల చంద్ర, సురేష్, షెహన్‌షాలు కలసి సత్కరించారు.

## వసతి గృహాల్లో విద్యార్థులకు వసతులు కరువు

### -మరుగుదొడ్లు, మంచినీరులేక అవస్థలు పడుతున్న విద్యార్థులు

నాయుడుపేట రూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త ;
రాష్ట్రప్రభుత్వం వసతిగృహాల్లో చదువుకునే విధ్యార్దులకు మెరుగైన విధ్య, వసతులు కల్పించాలన్నా దృడ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుంటే నాయుడుపేట మండలంలోని పలువ సతిగృహాల్లో పనిచేసే వార్డెన్లు పనితీరు అందుకు బిన్నంగా మారుతుంది. ఈక్రమంలో నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు, నాయుడుపేటలో ఉండే బిసివసతి గృహంలో చదువుకునే విద్యార్దులకు రోజురోజుకు వసతులు కరువవుతున్నాయి. బిసి వసతి గృహంలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు 65మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు మరుగుదొడ్లు, మంచినీరు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మెను కూడ సక్రమంగా అందించడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం విద్యార్థులకు పాలు, సాయంత్రం పండ్లు ఇవ్వడంలేదన్నారు. వసతి గృహంలో మంచినీరు లేక విద్యార్థులు రెండుమూడు రోజులకు ఒకసారి స్థానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడు తుందన్నారు. వసతిగృహాల ఆవర్ణంలో మురికినీరు నిల్వచేరి అపరిశుభ్రంగా వుండటంతో విద్యార్థులకు తరచూ జ్వరాలు వస్తున్నాయని విద్యార్దులు వాపోతున్నారు. వసతిగృహాలపై అధికారుల పర్యవేక్షణ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు వసతులు దూరమౌతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.




గొట్టిప్రోలు బిసి బాలుర వసతిగృహం దృశ్యం

## హాజరు నమోదుకు హైరానా

### - సాంకేతిక సమస్యలతో ఉపాధ్యాయుల అవస్థలు

కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త
వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమై నెలన్నర గడిచిపోయింది. ఇప్పటికీ అటెండెన్స్ యాప్ సక్రమంగా పనిచేయడం లేదు. నిత్యం ఉపాధ్యాయులు హాజరు నమోదు చేసుకోవడానికి కుస్తీలు పడుతున్నారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటల తర్వాత వేచి ఉండి హాజరు వేసుకోవాల్సిన పరిస్థితి. సాధారణంగా స్కూలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ లోపే వచ్చి హాజరు వేసుకోవడానికి ప్రయతిస్తుంటే దానిపై రద్దీ పడి తరచూ మొరాయిస్తుంది. దానికి సాంకేతిక సమస్యలు తోడై సిగ్నల్స్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తిరుపతి జిల్లాలో 8 వేల మందికిపైగా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరు నిర్దేశిత సమయంలోపు హాజరు వేసుకోవాలన్నది ఆలోచన. సక్రమంగా స్కూలుకు చేరుకున్నా యాప్ సక్రమంగా పనిచేయకపోవడంతో హాజరు నమోదు ఆలస్యంగా చేసుకోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ప్రధానోపాధ్యాయులు ఉదయం 8.30 గంటలకే వెళ్తారు. ఆ సమయంలో సర్వర్‌పై అంతగా ఒత్తిడి ఉండదు. దీంతో వారికి సకాలంలో హాజరు పడుతుంది. ఎటొచ్చీ ఉపాధ్యాయులు అందరూ వచ్చాక హాజరు వేసుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయుల రద్దీకి తగ్గట్టుగా సర్వర్ సామర్థ్యం లేదన్నది టీచర్ల అభిప్రాయం. ఒక ఉపాధ్యాయుడికి సగటున 3 నుంచి 6 నిమిషాలు పడుతుంది. ఈ సమయంలో సర్వర్ వేగం బాగుంటే అందరూ హాజరు వేసుకోవచ్చని చెప్తున్నారు. అటెండెన్స్ యాప్‌తో పాటు మధ్యాహ్న భోజనం తినే విద్యార్థులు, వంటకాలు ప్రతీది యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ యాప్ సక్రమంగా పనిచేయడం లేదు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదని, ఇకనైనా సిగ్నల్స్ సమస్యా ?ఇంకేదైనా ఉందా అనేది తెలియడం లేదని చెప్పారు.

## రామకుప్పంలో రేపటి నుంచి తెదేపా సైకిల్ ర్యాలీ

**రామకుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త :**
కుప్పం నియోజకవర్గంలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు ఈసారి ఎన్నికల్లో లక్ష మెజార్టీ సాధించాలని దేశం శ్రేణులు నిర్ణయించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తొలి కార్యక్రమంగా నియోజకవర్గంలో సైకిల్ ర్యాలీకి శ్రీకారం చుట్టనున్నారు. ఈనెల 4వ తేది రామకుప్పంలోని శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం తెదేపా శ్రేణులు సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తారు. ఈనెల 4వతేది రామకుప్పం, రాజుపేట, కొంగనపల్లి, చెల్దిగానిపల్లి, బైపరెడ్డపల్లిలో సైకిల్ ర్యాలీ జరగనుంది. ఈనెల 7వతేది లోగా మండలంలోని 23పంచాయతీల్లో సైకిల్ ర్యాలీ పూర్తి చేయనున్నారు.

## ఎమ్మెల్సీ భరత్‌చే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

**శాంతిపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త :**
వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంను బుధవారం మండల కార్యాలయంలో ఎమ్మెల్సీ భరత్ ప్రారంభించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలకు హోం టేక్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, పెద్దన్న, సుబ్రమణ్యం, దండపాణి, ఎవి జయరాం, పట్టాభి, మురళి, రమేష్, కేశవులు, జగదీష్, ఎంపిడిఓ హేమమాలిని, తహశీల్దార్ కల్పన, సూపర్‌వైజర్ కల్పన పాల్గొన్నారు.

## అబకలదొడ్డిలో గడపగడపకు కార్యక్రమం



**శాంతిపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త :**
మండలంలోని అబకలదొడ్డి గ్రామం లో బుధవారం ఎమ్మెల్సీ, జిల్లా వైకా పా అధ్యక్షుడు భరత్ గడపగడ పకు మీ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతు న్నాయా లేదా అని అడిగి తెలుసుకు న్నారు.కార్యక్రమంలోజడ్పీటిసి శ్రీనివాసులు,ఎంపిపివసుంధరకోదండరెడ్డి, కన్వీనర్ దండ పాణినేతలు చక్రపాణిరెడ్డి,పెద్దన్న, కృష్ణమూర్తి, జగదీష్‌నాయుడు, విజయ్‌కుమార్, కేశవులు, రమేష్, పట్టాభి, సుబ్రమణ్యం, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

## పట్టణ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడుగా ఇర్లరాజ



**శ్రీకాళహస్తి,ఆగస్టు 2 ప్రభాతవార్త**
శ్రీకాళహస్తి నియోజకవర్గం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) అధ్యక్షులుగా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఇర్లరాజను నియమించారు. ఈనెల రెండవ వారంలో హైదరాబాదులో జరగనున్న మాదిగల విశ్వరూప సభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ నేతలు బుధవారం శ్రీకాళహస్తిలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ మందకృష్ణమాదిగ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో సన్నాహక సభ నిర్వహించామని తెలిపారు. ఈసన్నాహక సభ కుట్టుముల్ల చంద్రమాదిగ, గాదిపాకులమదు మాదిగల ఆధ్వర్యంలో జరిగింది. అతిధులుగా తిరుపతి జిల్లా కో ఇన్‌ఛార్జి వెంబడి రాధాకృష్ణ మాదిగ, ఎంఎస్పీ తిరుపతి జిల్లా అధ్యక్షులు తురక అమరనాధ్ వడ్డెర, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు వేలూరు రాజేంద్ర మాదిగలు హజరయ్యారు. ఛలో హైదరాబాద్ విశ్వరూప మహాసభను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరు తరలిరావాలని పిలుపునిచ్చారు. మాదిగల చిరకాలపు కోరిక ఎస్సీ వర్గీకరణ అన్నారు. వర్గీకరణ లేదంటే మాదిగలు నష్టపోతారని మూడు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటానికి ఇది అంతిమపోరాటం అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేష్‌వడ్డెర, చంద్రగిరి నియోజకవర్గ కో కన్వీనర్ రవిమాదిగ, పట్టణ యువజన అధ్యక్షుడు వెంకటమునిమాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బృందమ్మను కలసిన భజన కళాకారులు



**శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త**
శ్రీకాళహస్తి మండలంలోని నారాయణపురం పంచాయతీ పెంకులపాడు గ్రామానికి చెందిన భజన కళాకారులు గజ్జపూజకు రావాలని కోరుతూ దివంగతనేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జలబృందమ్మను ఆహ్వానించారు. ఈ సందర్భంగా బృందమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో భజన కళాకారులకు ఎన్నడూ గుర్తింపు ఉంటుందని అంతేకాకుండా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కూడా కళాకారుల భజనలు ఎంతో చక్కగా ఉంటాయని అభినందించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు కోలాటాలు, భజనలు, గజ్జెపూజలు అలరిస్తాయన్నారు. అనంతరం కళాకారులకు బృందమ్మ ఆర్థికసాయం అందించారు.

## హత్య కేసును ఛేదించిన పోలీసులు -నిందితుడు అరెస్ట్

**తవణంపల్లె, ఆగస్టు 2 ప్రభాతవార్త:**




మండలంలోని ఎగువ మారేడుపల్లె గ్రామంలో జరిగన హత్య కేసును పోలీసులు చేదించారు. హత్య కేసులో నిందితున్ని బుధవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. నిందితుడు హత్యకు వినియోగించిన కత్తి, బంగారు నగలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని జిల్లా కేంద్రం చిత్తూరులో జిల్లా ఏఎస్పీ సుధాకర్ మీడియా ఎదుట హాజరుపరచి వివరాలను వెల్లడించారు. మండలంలోని ఎగువ మారేడుపల్లె గ్రామానికి చెందిన అనసూయమ్మ అనే వృద్ద మహిళ గత నెల 11న హత్యకు గురైంది. ఈమేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎగువ మారేడులపల్లె గ్రామానికి చెందిన జస్వంత్ నాయుడు అనే వ్యక్తి బెంగుళూరులో సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడ్డ జస్వంత్ డబ్బులు సరిపడకపోవడంతో స్వగ్రామంలో ఒంటరిగా వుంటున్న అనసూయమ్మను లక్ష్యంగా చేసుకుని పథకం ప్రకారం ఆమెను హత్య చేసి బంగారు నగలను అపహరించి పరారయ్యారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె, గుడిపాల ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్, సిబ్బంది ప్రత్యేక బృందాలను ఏర్పడి దర్యాప్తు వేగవంతం చేశారు. ఆధారాలతో సహా నిందితుడిగా జస్వంత్‌ను గుర్తించి బుధవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కేసును చేదించడానికి కృషి చేసిన సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్, సిబ్బందిని అభినందిస్తూ ఏఎస్పీ రివార్డులను అందజేశారు.

## ఆరోగ్యానికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ : చైర్మన్

**కుప్పంరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికే ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం అమలు చేస్తోందని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాల యంలో సిడిపిఓ అరుణశ్రీ అధ్వర్యంలో నిర్వహిం చిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద బాలింతలు, తల్లిబిడ్డలు, చిన్నపిల్లలకు మంచి బలవర్థకమైన ఆహారం అందించడం జరుగుతోందన్నారు. అనంతరం హోంటేక్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి హెచ్‌ఎం అశ్విని, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, కౌన్సిలర్లు ఆర్.రంగయ్య, నాగరాజు, ఆంజనేయ గుడి ఛైర్మన్ కుమరేష్, అంగనవాడీ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉపాధిసామాజిక తనిఖీ సభలు



**కుప్పంరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :**
మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబం ధించి సామాజిక తనిఖీలు మొదలయ్యాయి. బుధవారం మండలంలోని నడిమూరు, కెడిపల్లి పంచాయతీల్లో పనుల తనిఖీ అనంతరం గ్రామసభ నిర్వహించారు. మండలంలో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఎస్ఎస్ఎల కింద దాదాపు 11 కోట్ల రూపాయలతో పనులు జరిగిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి మీరావలి, ఎపిఒ హరినాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.కాగా ఈనెల 9వతేది సామాజిక తనిఖీ బహిరంగ సభను కుప్పంలో నిర్వహించనున్నారు.

## అనుమానాస్పద రీతిలో మైనర్ బాలిక మృతి

**శాంతిపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త :**
మండలంలోని సోమాపురం గ్రామంలో ఓ మైనర్ బాలిక అనుమానాస్పద రీతిలో ఉరేసుకుని మృతి చెందినట్లు తెలిసింది. అయితే బాలిక మృతికి గల కారణాలు తెలియరాలేదు. రాళ్లబూదుగూరు పోలీసులు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేడు తవణంపల్లె మండల మీట్

**తవణంపల్లె, ఆగస్టు 2 ప్రభాతవార్త:**
మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేవ మందిరంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ గీత అధ్యక్షతన జరిగే సాధారణ సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## డీఐఓచే ప్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ సేవల తనిఖీ

**తవణంపల్లె, ఆగస్టు 2 ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎఫ్‌పీసీ సేవలను జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి రవిరాజు బుధవారం దిగువమాఘం గ్రామంలో తనిఖీ చేశారు. తవణంపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో దిగువమాఘంలో ప్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా 104 వాహనం ద్వారా రోగులకు అందిస్తున్న వైద్యసేవలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా 104 కార్యక్రమంకు సరిపడా మందులు వున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తవణంపల్లె పీహెచ్‌సీని సందర్శించి మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం అమలు గురించి సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ దాత్రేయ చౌదరి, డాక్టర్ మోహనవేలు, సీహెచ్‌ఓ సుబ్రమణ్యం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. ఇఇలా వుండగా మల్లకుంట సచివాలయ పరిధిలో జరుగుతున్న దోమల నివారణ చర్యలను జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా దోమలను నివారించడానికి మండల వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మలాథిన్ పిచికారి కార్యక్రమంను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ పీరూ సాహెబ్, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, చాముండేశ్వరి,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గర్భవతులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్‌ల పంపిణీ

**తవణంపల్లె, ఆగస్టు 2 ప్రభాతవార్త:**



ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'టేక్ హోమ్ రేషన్' కార్యక్రమం భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రం తవణంపల్లెలో బుధవారం బాలింతలకు, గర్భవతులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్‌ల పంపిణీ చేశారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న స్పాట్ ఫీడింగ్ స్థానంలో టేక్ హోమ్ రేషన్ కార్యక్రమంను ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టింది. ఈకార్యక్రమంలను మండల కేంద్రం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయం సమావేశమందిరంలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈసందర్భంగా బాలింతలకు, గర్భవతులకు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఈహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డిల చేతుల మీదుగా ఈకిట్‌లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజులు, మండల వైకాపా నాయకులు తడకర మధుకుమార్, సరకల్లు హరిరెడ్డి, పరమేశ్వరరెడ్డి, బాబురెడ్డి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రెడ్డి కళ్యాణి, సరళకుమారి, కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు,బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

## మాతా శిశు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఐరాల, ఆగస్టు 2 ప్రభాతవార్త:**
మాతా శిశు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రం ఐరాలలో ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన 'టేక్ హోమ్ రేషన్' కార్యక్రమంను ప్రారంభించి గర్భవతులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్‌ల పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న స్పాట్‌ఫీడింగ్ అమలు వల్ల గర్భవతులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారని తెలిపారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం 'టేక్ హోమ్ రేషన్' కార్యక్రమంను నూతనంగా ప్రవేశపెట్టి 10 రకాల పౌష్టికాహార వస్తువులను 'టేక్ హోమ్ రేషన్' కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్‌ల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలను బాలింతలు, గర్భవతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల తహసీల్దార్ సుశీల, వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి నాయకులు సురేష్‌రెడ్డి, ఐసీజీఎస్ సూపర్‌వైజర్లు లలితమ్మ, పి.మంజులతో పాటు గర్భవతులు,బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## బిడ్డల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తున్న సీఎం : ఎంపీపీ



**బాలాయపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త:**
పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉండాలని సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టెక్ హోమ్ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టెక్ హోమ్ పోషకాహారాన్ని బాలింతలు, గర్భవతులకు అందజేసిన ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వినీల్‌కుమార్, తహసీల్దారు పి.శ్రీనివాసులు, సర్పంచు దట్టం అంజలి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రారంభించాలని తెలిపారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం తయారు చేసి కేంద్రాల్లో పెట్టేవారు. ప్రభుత్వం ఇచ్చే పోషకాహారాన్ని కొంతమంది నిర్లక్ష్యం చేస్తున్నారని, వినియోగించి మంచి ఆరోగ్యం పొందాలని తహసీల్దారు పి.శ్రీనివాసులు సూచించారు. తల్లిపాల వారోత్సవాల నిర్వహణలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది తయారు చేసిన పోషకాహార నాణ్యతను ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, అధికారులు పరిశీలించారు.

## జలకళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఏపీడీ

**బాలాయపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త:**



వైఎస్ఆర్ జలకళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ వరప్రసాద్ కోరారు. స్త్రీ శక్తి కార్యాలయ ంలో డాక్టర్ వైఎస్ఆర్ జలకళ పథకంపై డక్కిలి, బాలాయపల్లి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ జలకళ పథకం రైతులకు వరం లాంటిదన్నారు. బోర్లు వేసేందుకు రాష్ట్ర కమ్యూనిటీ బోర్డు డెవలప్‌మెంట్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అనుమతి తీసుకోవాలని రైతులకు సూచించారు. ఇప్పటికే మొత్తం 70 బోర్లు ఈ పథకం ద్వారా వేశామని తెలిపారు. వీటన్నింటికీ విద్యుత్ సర్వీసులు రైతులే నగదు చెల్లించుకుని కనెక్షన్లు పొందాలని సూచించారు. వెంకటగిరి నియోజకవర్గంలో 500 బోర్లు వేస్తామని ఇంకా అవసరమైన రైతులు జలకళ పథకానికి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వినీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం గర్భవతులకు వరం

**- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద**



**వెంకటగిరి, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం గర్భవతులకు వరం లాంటిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. వెంకటగిరి పట్టణం 14, 15 వార్డులకు సంబంధించి ధర్మాపురం సచివాలయంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషకాహారం కిట్లను గర్భవతులకు చైర్‌పర్సన్ భానుప్రియ, దొంతు శారద, కౌన్సిలర్లు పంపిణీ చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టబోయే బిడ్డల ఆరోగ్యంపై కూడా ముందు చూపుతో సంపూర్ణ ఆహారాన్ని గర్భవతులకు అందించడం మంచి మనసుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలోచైర్‌పర్సన్‌నక్కభానుప్రియ,వైస్‌చైర్మన్‌బాలయ్య,ఉమామహేశ్వరి,కమిషనర్ వెంకటరామయ్య,కౌన్సిలర్లుశంకరయ్య,నారిశేఖర్, కళ్యాణి, ధనియాల రాధా, పూజారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## యువకుని అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

**తడ, ఆగస్టు 2 ప్రభాతవార్త :**
తడలో ఒక యువకుడు అదృశ్యమైనట్లు పాలా చక్రపాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక అనపగుంటకు చెందిన చక్రపాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, తన కుమారుడు పాలా రాజేష్ (32) శ్రీసిటీలోని ఒక కంపెనీలో సెక్యూరిటీగా పనిచేస్తున్నాడని, జూలై 13న తడ బజారుకు వెళ్లి అకౌంట్‌లో పడి ఉన్న పొదుపు డబ్బులు తీసుకొస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. అనంతరం చుట్టుపక్కల గాలించి రాజేష్ ఆచూకీ తెలియకపోవడంతో ఫిర్యాదు చేస్తున్నామని పేర్కొన్నారు. తడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తల్లిపాలే బిడ్డలకు శ్రీరామరక్ష



**ఓజిలి, ఆగస్టు 2 ప్రభాతవార్త :**
ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు అత్యంత ఉపయోగకరంగా నిలుస్తాయని వైద్యాధికారి జి.హిమజ పేర్కొన్నారు. ఓజిలిలోని అరుంధతీయవాడ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సృజన అధ్యక్షతన అంగన్‌వాడీ టీచర్లు వి.శ్యామల, విజయ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యాధికారి జి.హిమజ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లి పాలతోనే శిశువు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. తల్లిపాలు ఉపయోగాల గురించి గర్భిణులకు, బాలింతలకు వివరించారు. శిశువుకు రెండేళ్ల నిండే వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలతోనే శిశువు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ పోషణ ద్వారా ఏడురకాలైన పాలు, గుడ్లు, ఖర్జూరం, బెల్లం, అటుకులు, రాగిపిండి, జొన్నపిండి వంటి పోషక పదార్థాలను ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సృజన, వైద్యశాఖ అధికారి హిమజ, ఉపాధ్యాయులు తోళ్ల నారాయణ, మంగలపూరి రవికుమారి, అంగన్‌వాడీ టీచర్లు వి.శ్యామల, విజయ, స్వర్ణ, పద్మ, బంగారమ్మ, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేసిన ఎంఇఓ

**కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



కోట మండలంలోని చెందోడు యూపి పాఠశాల, గూడలి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఇఓ మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ప్రభుత్వం జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, విద్యార్థులకు అందజేసిన జగనన్న కిట్లు అందరికీ అందాయా లేదా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పకుండా పాటించాలన్నారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం రాష్ట్రప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పుచ్చలపల్లిలో అక్రమంగా ఇసుక రవాణా

**కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



కోట మండలం పుచ్చలపల్లి రీచ్‌లో అక్రమంగా ఇసుక ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా తరలి వెళుతోంది. అటు పోలీసులు గాని, ఇటు సెబ్ పోలీసులు గాని పట్టించుకోవడం లేదని విమర్శలు వినవస్తున్నాయి. గత రెండురోజుల నుంచి ట్రాక్టర్ల ద్వారా పుచ్చలపల్లి పంచాయతీ నుంచి ఇసుక రవాణా అక్రమంగా జరుగుతోంది. ఆ గ్రామ టిడిపి నాయకులు పుచ్చలపల్లి కోటేశ్వరరెడ్డి బుధవారం సెబ్ అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

## వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ

**కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



కోట మండలంలోని మద్దాలి, చిట్టేడు అంగన్‌వాడీ కేంద్రాల్లో సిడిపిఓ మునికుమారి వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు బియ్యం 3 కేజీలు, కందిపప్పు కేజీ, పామాలిజ్ అర లీటరు, కోడిగుడ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దాలి సర్పంచ్ పచ్చా వాణి, చిట్టేడు సర్పంచ్ కె.రాఘవయ్య, చంద్రశేఖర్, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శి సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటలో తల్లిపాల వారోత్సవాలు

**కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



కోటలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి అనంతరం సిడిపిఓ మునికుమారి తల్లి ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డకు ఆరు నెలలు పూర్తయ్యే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఇతర డబ్బా పాలు ఇవ్వరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త పెంచలమ్మ, లక్ష్మి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## 10న ఢిల్లీలో రైల్వే ఉద్యోగులు, కార్మికుల నిరసన

**- ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా తరలి రావాలి**

**నాయుడుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



ఈ నెల 10వ తేదీన ఢిల్లీలో రైల్వే ఉద్యోగులు, కార్మికుల డిమాండ్ల సాధన లక్ష్యంగా సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్ర మానికి రైల్వే ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎస్ఆర్‌ఎంయు సూళ్లూరుపేట బ్రాంచి కార్యదర్శి చెంచురత్నం పిలుపునిచ్చారు. నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే ఉద్యోగులు, కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఇతర డిమాండ్లను సాధించే దిశగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌ఎంయు నాయకులు చిరంజీవి, పోలయ్య, కిరణ్‌కుమార్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

## టేక్‌హోం రేషన్ సద్వినియోగం చేసుకోవాలి : ఛైర్‌పర్సన్

**నాయుడుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



ప్రభుత్వం ఎంతో మంచి ఆలోచనతో అమలు చేస్తున్న టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. నాయుడుపేట పట్టణంలోని ఎల్ఎసాగరం ప్రాంతంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సిడిపిఓ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ కటకం దీపిక మాట్లాడుతూ ఎంతో మంచి ఆలోచనతో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దారా రవి, అశోక్, హెల్త్ సూపర్‌వైజర్ సుకన్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఆశాబేగం తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యాదీవెన ఇకేవైసి పూర్తి చేయాలి



**నాయుడుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త**
జగనన్న విద్యాదీవెనలో ఈకేవైసీ, పేమెంట్ అక్నాలెడ్జ్ మెంట్‌లపై ప్రత్యేక శ్రద్ధ చూపి వాటిని రెండురోజుల్లో పూర్తి చేయాలని తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య తెలిపారు. బుధవారం నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం లో సూళ్లూరుపేట ఎఎస్‌డబ్ల్యుఓ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట, చిట్టమూరు మండలాల్లోని సంక్షేమ, విద్యా సహాయకులకు, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ పరిధిలోని వార్డు ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెనకు సంబంధించిన పనులు రెండురోజుల్లో పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎఎస్‌డబ్ల్యుఓ సుధామయి, సుకుమార్, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

## రైతుల సమస్య పరిష్కారం కోసమే భూ సర్వే

**తహశీల్దార్ శివరామ సుబ్బయ్య**

**ఓజిలి, ఆగస్టు 2, ప్రభాతవార్త**
ఓజిలి మండలంలోని రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం భూ రీసర్వే చేస్తున్నట్లు ఓజిలి తహశీల్దార్ శివరామ సుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం ఓజిలి మండలంలోని కురుగొండ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయని ఆయన వివరించారు. భూ రీసర్వే జరిగిన తరువాత భూమిపై 100 శాతం సమస్యలు పరిష్కారమవుతాయి. సర్వే అంటే భయపడాల్సిన అవసరం లేదు అని గతంలో మాదిరిగా హద్దు చేరిపేస్తే మారిపోతుందనుకునేవి భ్రమలుగా తొలగిపోతాయి. క్యూఆర్ కోడ్ ద్వారా పక్కా సర్వే జరుగుతుందని, ఒక్క సారి రీ సర్వే జరిగిందంటే ఆ భూమి రికార్డులు పదిలంగా ఉంటాయి. మ్యూటేషన్లు, ఇలా ఎన్ని సార్లు భూములు బదలాయించినా రికార్డులు మాత్ర తారుమారు అయ్యే ఆస్కారం ఉండదని భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలు ఉండవని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న భూముల రీసర్వేతో సమస్యలు సంపూర్ణంగా పరిష్కారం అవుతాయని ఆయన పేర్కొన్నారు. భూ సమగ్ర సర్వేతో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని అన్నారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం అన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, కురుగొండ సర్పంచ్ తిరుమలశెట్టి శ్రీలక్ష్మి, వీఆర్వోలు, కురుగొండ గ్రామ రైతులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## చుక్కల నిడిగల్లులో సుధీర్‌కు సన్మానం

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గ్రామంలో బుధవారం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డిని భట్రాజులు సత్కరించారు. తెలుగుదేశం పార్టీ భట్రాజుల సాధికార సమితి రాష్ట్ర సభ్యుడుగా రత్నాకరం నరసింహారాజుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌ంరెడ్డిని గ్రామ భట్రాజులు సత్కరించారు. ముఖ్యఅతిధిగా భట్రాజు సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ ప్రసన్నంజనేయ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డిని సత్కరించారు. రాష్ట్ర కన్వీనర్ ప్రసన్నంజనేయ రాజు మాట్లాడుతూ భట్రాజు కులం అభివృద్ధికి మొట్టమొదట గుర్తింపు నిచ్చి కకుల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.15కోట్ల రూపాయలను కేటాయించి సామాజికంగా అర్థికంగా రాజకీయంగా ప్రోత్సహించి ఆదుకుంటుందని వివరించారు. .రాబోవు ఎన్నికల్లో తాము తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో భట్రాజు సంఘం నాయకులు చక్రవరం సుబ్రమణ్యం రాజు, రత్నాకరం వెంకమ్మ రాజు, రాజు యశ్వంత్ రాజు, ధూపాటివేణుగోపాల్ రాజు, బొక్క రాజు సుబ్రమణ్యం రాజు, సాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

## గోపాలకృష్ణాపురంలో ఇంటింటా సర్వే

శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఉడమల పాటు పంచాయతీ గోపాకృష్ణాపురంలో బుధవారం ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శి లీలావతి చేపట్టారు. శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కే.యస్ రామారావు ఆదేశాలతో గ్రామాల్లో ఇంటింటా సర్వేను నిర్వహించుటకు ఆదేశించారని ఈ మేరకు చేపట్టామని వివరించారు. గోపాలకృష్ణాపురంలో అర్హులైన వారు కొందరు ఓటరు జాబితాల్లో లేనట్లు తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. అర్హులైన వారందరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

## వైకాపాలోకి వలసల జోరు: నాయకుల హుషారు

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలో వైకాపా పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చి దిద్దుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి ప్రణాళిక ప్రకారం మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి వాడ వాడల్లో వైకాపా పార్టీకి పెట్టని కోట గోడల వలె కార్యకర్తలను చేర్చుతున్నారు. ఈ నేధ్యంలో బుధవారం ఏర్పేడు మండలం మర్రిమందకు చెందిన 40 మంది తెలుగుదేశం పార్టీ మద్దతు దారులను వైకాపా కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గ్రామానికి చెందిన పి.రంగనాథం, రామయ్య, బత్తయ్య, చిన్నబత్తయ్య, చలపతి, మణి, శివ, సులోచన, గౌరమ్మ, శంకరమ్మ వారి సహచరులకు ఎంఎల్ఏ మధుసూధనరెడ్డి శాలువ కప్పి ఆహ్వానించారు. జగనన్న సంక్షేమ కార్యక్రమాలు, బియ్యపు మధుసూ ధనరెడ్డి చూపుతున్న ఆదరణ, అభివృద్దిని చూసి తాము పార్టీలో చేరినట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఏర్పేడు మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, డిజె సుధీర్, మణి, కృష్ణారెడ్డి, లింగయ్య, బాషా, హేమాద్రి, జయప్రకాష్, వంశి, శివ, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్దుడు మృతి

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం వైకాపా ఇన్‌చార్జి వెల్లంపాటి నాగూర్‌రెడ్డి తండ్రి వెలంపాటి దేశిరెడ్డి(75) ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. గత కొంత కాలంగా ఆయన అస్వస్థతతో మంగళవారం రాత్రి 10.20గంటలకు తుది శ్వాస వదలినట్లు తెలిపారు. ఆయన మృతదేహన్ని బుధవారం స్వగ్రామమైన గొల్లపల్లికి చేర్చారు. మండలంలోని వైకాపా పార్టీ కార్యకర్తలు, నాయకులు అంత్యక్రియలకు హాజరయ్యారు. పార్టీ కార్యలయం నుంచి ఎంఎల్ఏ పిఏ సలీం, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ శ్యాం తదితరులు హాజరై నాగూరురెడ్డికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

## టమోటా ధరల మంటను అదుపు చేయాలి

-బీజేపి డిమాండ్

సత్యవేడు, ఆగస్టు 2,ప్రభాతవార్త:

టమోటా ధరలు రోజు రోజుకు ఆకాశానంటుతున్నందున ధరల నియంత్రణ చేపట్టాలని బీజేపి నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపి మండల అధ్యక్ష్యుడు జిఎం ప్రతాప్ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టమోటా ధరలు అమాంతం పెరగడం వెనుక ప్రభుత్వ వైఫల్యం అధికంగా ఉందన్నారు. రైతలకు సకాలంలో సబ్సీడీ విత్తనాలు, మద్దత్తు ధరలు ఇచ్చిఉంటే నష్టపోయిన రైతు తిరిగి పంటవేసే పరిస్థితి ఉండేది. ప్రస్తుత పరిస్థితిలో కూడా రైతులు అందరూ భాగుపడుతున్నారనీ ప్రభుత్వం మొద్దునిద్రలో ఉండటం వల్ల దళారీల వ్యవస్థ లక్షల్లో లాభాలు అర్జిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయ మార్కెట్ల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసి, విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు తక్కువ ధరకు టమోటా దొరికేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లాఅధ్యక్ష్యుడు మునికృష్ణయ్య, ప్రధానకార్యదర్శి వాసు తదితరులు పాల్గోన్నారు.

## యువతను సదిశలో నడపడానికి ఆడుదాం ఆంధ్ర

నగరి, ఆగస్టు 2 ప్రభాతవార్త:



యువతను సదిశలో నడపడానికి ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నమఃశివాయం తెలిపారు. టోర్నీ నిర్వహణలో భాగంగా ఆయన స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం సచివాలయ కార్యదర్శులు, పీడీలు, పీఈటీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17 సంవత్సరాలు, ఆపై వయసు గల వారికి అన్ని గ్రామాలు, వార్డు సచివాలయాల స్థాయి నుంచి ఆడుదాం ఆంధ్ర టోర్నీని నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబరు 2 గాంధీ జయంతి నుంచి ఈ టోర్నీని నిర్వహించడానికి ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇందులో భాగంగా ఐదు వేరు వేరు దశల్లో ప్రతి గ్రామ, వార్డు సెక్రటేరియట్‌లో ఐదు కాంటిటీవ్, మూడు నాన్ కాంపిటేటివ్ క్రీడలు యువతి, యువకుల కోసం నిర్వహిస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో గెలిచిన జట్లు మండల నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీ పడతాయన్నారు. యువతను క్రీడలల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన జీవనశైలి అవలంబించేలా చేయడం, చెడు అలవాట్లను అలవరచుకునేలా జీవన నాణ్యతను మెరుగుపరచడం ఆడుదాం ఆంధ్ర టోర్నీ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ క్రీడల నిర్వహణలో అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పీడీ ఎన్.మణి, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు పనులు పరిశీలించిన డీఈవో

నగరి, ఆగస్టు 2 ప్రభాతవార్త:



మండలంలో నాడు-నేడు పథకంలో చేపడుతున్న పనులను జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు, అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి బుధవారం పరిశీలించారు. నాడు-నేడులో భాగంగా పూర్తయిన 10 పాఠశాలలను, పెయింటింగ్ పనులు జరుగుతున్న కొన్ని పాఠశాలలను పరిశీలించిన వారు త్వరగా పాఠశాలలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. జరుగుతున్న పనుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఆయన వెంట ఎంఈవో నమఃశివాయం, పాఠశాల పధ్రానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

## ప్రతి గర్భిణీ వైఎస్ఆర్‌సంపూర్ణ పోషణను సద్వినియోగం చేసుకోండి

విజయపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త:



ప్రతి గర్భిణీ, బాలింత వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జమున పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రమైన విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ప్రతి గర్భిణీ మహిళలకు ప్రభుత్వం ప్రతి నెల మూడు కేజీల బియ్యం, కిలో పప్పు, అర్థ కేజీ నూనె, అటుకులు, చిక్కీలు, బెల్లం పంపిణీ చేస్తున్నారని తెలిపారు. మండలంలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నుంచే పంపిణీ కార్యక్రమం మొదలవుతుందని సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. తహసీల్దార్‌వెంకట్రాయులు, ఎంపీడీవో ప్రసాద్, సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

**శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త** యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈశ్వరయ్య కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించారు. ఈసందర్భంగా సంస్థ ట్రెజరర్ నారాయణ, సభ్యులు గోపి, కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతిదేవి, సహోపాధ్యాయిని శిరీష, సిఆర్‌పి ప్రదీప్‌కుమార్, ధనశంకర్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా సంస్థ ట్రెజరర్ మాట్లాడుతూ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు హేమకుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే

రేణిగుంట, ఆగస్టు 2 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మరకసారి నొక్కి వక్కాణించారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లె గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పలు అభివృద్ధి సంక్షేమ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవన సముదాయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్లను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ ఉమా, సింగిల్‌విండో ఛైర్మన్ గణేష్‌రెడ్డి, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. యువకులు ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అసాధ్యాలను సుసాధ్యం చేయడం ముఖ్యమంత్రికి సాధ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి అభివృద్ధి చేస్తున్నారన్నారు. వైసీపీని ఓడించడం ఎవరి వల్ల కాదన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, దయాకర్‌రెడ్డి, అర్బన్ సీఐ సుబ్బారెడ్డి, రేణిగుంట మండల వ్యవసాయ అధికారి సునీల్, రేణిగుంట మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు గాజులమండ్యం సర్పంచ్ డా. గంగారి రమేష్, గురవరాజుపల్లె రహీం, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు శోభ, బాబ్జి, వైసీపీ నేతలు నాగ సుబ్రహ్మణ్యంరెడ్డి, చెంగల్రాయుడు, మునిరెడ్డి, లోకనాథరెడ్డి, ముద్దుకృష్ణ, సుబ్రహ్మణ్యం, ధనంజయులు, మునిరెడ్డి, సుదర్శనబాబు, శ్రీ సాయిరెడ్డి, ముద్దరాయులు, మహాదేవరెడ్డి, శంకర్‌రెడ్డి, వేణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మదన్నకు సాటి ఎవరూ లేరు...

రేణిగుంట, ఆగస్టు 2 ప్రభాతవార్త:



అహర్నిశలు ప్రజలకు సేవ చేస్తున్న మదన్నకు సాటి ఎవరూ లేరని సూరప్పకసం పంచాయతీ బోడి తుము, బీసీ కాలనీ, చెంగారెడ్డి పట్టెడ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి బుధవారం జేజేలు పలికారు. గడప గడపకు మనప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఇంటింటికి తిరిగారు. మహిళలు మంగళ హారతులతో ఎదురువెళ్లి అభిమానంతో స్వాగతం పలికారు. ప్రజల అభిమానానికి ఎమ్మెల్యే మంత్ర ముగ్దులయ్యారు. ఎమ్మెల్యే ప్రజల్లో తానొకడై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పథకాలను తెలియజేశారు. వృద్ధులకు, వితంతవులకు, వికలాంగులకు, పింఛన్లు ఆలస్యం చేయకుండా అందించాలని వలంటీర్లను కోరారు. అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే అధికారులను తక్షణం పరిష్కరిస్తాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ సారి ఎన్నికల్లో కూడా వైసీపీని గెలిపించాలన్నారు. ఎమ్మెల్యేతో పాటు గడప గడపకు తిరిగిన వారిలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీసంధ్యారాణి, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు, గాజులమండ్యం సర్పంచ్ డాక్టర్ గంగారి రమేష్, సూరప్పకశం సర్పంచ్ సుధ, ఎంపీటీసీ శశికిరణ్, విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్ రెడ్డి రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, వైసీపీ సీనియర్ నేతలు దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, అత్తూరు మాజీ సర్పంచ్ హరి యాదవ్, ఎస్సీ నాయకురాలు అరుణాదేవి, వైసీపీ నేతలు శివారెడ్డి, మండలంలోని వివిధ శాఖల అధికారులు, వైసీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మవారికి పాత్రలు వితరణ

తిరుచానూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి బుధవారం విజయవాడకు చెందిన కశినేని చిన్ని 8 లక్షల 26 వేలు రూపాయిలు విలువ కలిగిన పాత్రలను కానుకగా ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, ఇన్స్పెక్టర్ ప్రసాద్‌కు అందజేసారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసారు. అమ్మవారి కుంకుమ సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## తిరుపతి నుంచి ప్యాకేజీ టూర్‌లు

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 2, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ ఎం. గిరిధర్ రెడ్డి తిరుపతి నుంచి కొత్త ప్యాకేజీ టూర్లను ప్రవేశ పెట్టినట్లు డివిజనల్ మేనేజర్ ఎం. గిరిధర్ రెడ్డి తెలిపారు. కాణిపాకం, శ్రీ కాళహస్తి, తిరుచానూరు, శ్రీనివాస మంగాపురం ఒక ప్యాకేజీ టూర్, కాణిపాకం, గోల్డన్ టెంపుల్ (వేలూరు) తిరుచానూరు, శ్రీనివాస మంగాపురం ఒక టూరు, శ్రీ కాళహస్తి, గుడిమల్లం, తొండమనాడులకు క్రొత్త ప్యాకేజీ టూర్లను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే నడుస్తున్న తిరుపతి స్థానిక ఆలయాల టూర్లు తిరుపతి సమీప ఆలయాల టూర్లు కాణిపాకం, స్థానిక ఆలయాల టూర్లు, శ్రీకాళహస్తి స్థానిక ఆలయాల టూర్లకు విశేష ఆదరణ లభిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇతర వివరాలకు 9848007033 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## టిడిపి మహిళా కార్యదర్శిగా పి గీత

తిరుపతి టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త



తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ మహిళా కార్యదర్శిగా పాటూరు గీతాను నియమించినట్లు తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు జి. నరసింహ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు కె. అచ్చం నాయుడు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వలగపూడి అనిత ఆదేశాల మేరకు పాటూరు గీతను నియమించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గీతా మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు దక్కుతుందన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ విజయం సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాపై నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చినందుకు తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి ఎం. సుగుణమ్మ, టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## సిపాయి భరోసా

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్), ఆగస్టు 2 ప్రభాతవార్త



మండలంలోని పాతవీరాపురం గ్రామంలో ఇటీవల చనిపోయిన సుండి దాము కుటుంబసభ్యులను రష్ అధినేత ఎంఎల్సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పరామర్శించారు. ఆ కుటుంబానికి నేనున్నానని భరోసా ఇచ్చారు. కుటుంబసభ్యులకు మనో ధైర్యాన్ని కల్పిస్తూ ఆర్థికంగా నిలబడాలని వివరించారు. ఆ కుటుంబానికి దాము తల్లి జయంతికి 40 రకాల ఆహారపప్పు దినుసులను అందించారు. ఏ సమయంలో అయినా ఏదైనా అవసరమైతే తనకు సమాచారం అందిస్తే ఆదుకుంటానని తెలిపారు. నిరుపేద కుటుంబాలను ఆదుకొనుటకు 'సిపాయి భరోసా'ను ఏర్పాటు చేసి ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల వైసిపి నాయకులుపాతగుంట గురువారెడ్డి, మాజీ ఎంపిటిసి మునిరత్నం రెడ్డి, రష్ ఆసుపత్రి మేనేజర్ లక్ష్మీకాంత్, మునిశేఖర్, పాల్గొన్నారు.

## రోజు వారి కూలి రూ.272లు అందించాలి

ఏర్పేడు(శ్రీకాళహస్తి రూరల్), ఆగస్టు 2 ప్రభాతవార్త



మండలంలోని అంజిమేడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ధ్వామాప్రాజెక్టు డైరెక్టర్ సివి శ్రీనివాస్‌ప్రసాద్ తనికీ చేసారు. బుధవారం ఆయన పనులు జరిపిస్తున్న నిర్వాహాకులను పలు సూచనలు చేసారు. పంచాయతి నందు జాబ్‌కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పిస్తున్న వారి జీవన ప్రమాణాలను పెంపొందించాలని భూములు కలిగిన ప్రతి దళిత, గిరిజన, చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటలు పెంపకం పూల తోటల పెంపకం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టుకుంటే వారి పోలాలల్లోనే చెట్లను సంరక్షణ చేసుకుంటే వేతనాలు, మెటీరియల్ చెల్లింపులు మూడు సంవత్సరాల పాటు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రయోజనాలు పొందవచ్చునని తెలియజేసారు. జాబ్ కార్డులేని వారికి జాబ్‌కార్డులు ఇవ్వాలని కూలీలందరికి సురక్ష భీమా ద్వారా రూ.20లకే రూ.2లక్షల ప్రమాదబీమా, జీవన్‌జ్యోతి బీమాయోజన ద్వారా 436రూపాయలతో జీవిత బీమా సౌకర్యం అందించాలని డైరెక్టర్ ఆదేశించారు.

## రాజనీతిశాస్త్ర అనువాదకులుగా సురేష్ నియామకం

శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త



గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠంలో ఇంటర్‌మీడియట్ సార్వత్రిక కోర్సులను నిర్వహిస్తున్నారు. వాటికి ఇంటర్మీడియట్ రాజనీతిశాస్త్రం అనువాదకులుగా ఊరందూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కూనాటి. సురేష్ నియమితులయ్యారు. సాంఘిక శాస్త్రానికి విశేష సేవలందించి కూనాటి సురేష్‌ను ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తక రచనల్లో పాలుపంచుకునేలా చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి ఇంటర్‌మీడియట్ పాఠ్యపుస్తక రచనల్లో సాంఘికశాస్త్రం నుంచి సురేష్ మాత్రమే ఎంపికవడం గమనార్హం. రాష్ట్రాలలో కార్యనిర్వాహకవర్గం, రాష్ట్ర శాసనసభ, హైకోర్టులు అనే పాఠ్యాంశాలను అనువదిస్తున్నట్లు సురేష్ తెలిపారు.

## అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆకాంక్ష

-సప్తగిరి నగర్ ఉప సర్పంచ్ అశోక్‌కుమార్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:



అందరూ ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలనే ఆకాంక్షతోనే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలందరికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని సప్తగిరి నగర్ ఉప సర్పంచ్ వసంత అశోక్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం సప్తగిరి నగర్‌లో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని, రక్త పరీక్షలు, ఇ.సి.జి, బి.పి. షుగర్, ఇతరత్రా పరీక్షలను చేయించుకున్నారు. వైద్య సేవలకు వచ్చిన ప్రజలకు ఉచితంగా అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు అందరి సంక్షేమం కోరి, ముందుచూపుతో ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌భాస్కర్, విఆర్వో భూపతి తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ఆర్ సంపూర్ణ పోషణ పంపిణీ

నింద్ర, ఆగస్టు 2 ప్రభాతవార్త :

వైయస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమం యంపిడిఓ కార్యలయంలో బాలింతలకు, గర్భవతులకు సంపూర్ణ పోషణ కిట్‌లను యంపిపి దీపాజలంధర్‌రాజు చేతుల మీదగా బుదవారం పంపిణి చేసారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్‌జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడ ప్రవేశపెట్టని పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని పేదలకు అందజేస్తున్నారని తెలిపారు. ఈపథకం వలన గర్భవతులు, బాలింతులు మంచి పౌష్టికాహారంతో పిల్లలకు జన్మనిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ అరుణ, తహశీల్దారు అమరేంద్రబాబు, వైస్ యంపిపి శుభారామ్, రాష్ట్ర సాహిత్య అకాడిమి డైరెక్టర్ జయశ్రీ శ్యామ్‌లాల్, గ్రామ సర్పంచ్ వసంత్‌బాబురెడ్డి, వైకాపా మండల కన్వీనర్ వేణరాజు, జిల్లా వైకాపా మహిళా కార్యదర్శి మేరీజయరామ్, సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార కిట్ల పంపిణీ

వడమాలపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:



తల్లిపాల వారోత్స వాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో బుధవారం బాలింతలు, గర్భిణీలకు పోషకాహార కిట్లు అందజేశారు. ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లి, బిడ్డలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో భానుమూర్తి, ఎంఈవో తులసిరాం, వైద్యాధికారి చక్రపాణి, సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రోజారమణి, మనీల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## అది శ్రవణ పౌర్ణమి అభిషేకం

వడమాలపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:

అది శ్రవణ పౌర్ణమి సందర్భంగా సదాశివకోనలో సదాశివుడి మహాలింగానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం వేకువ జామున అభిషేకం నిర్వహించి స్వామివారిని పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరించి మంగళ హారతులు ఇచ్చారు.

## తల్లిపాల వారోత్సవాలు

పుత్తూరురూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:



పుత్తూరు మండలం రామకృష్ణాపురం పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్స వాల్లో భాగంగా రెండో రోజు గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గర్భిణీలకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పౌష్టికాహార పదార్థాలు రాగిపిండి, అటుకులు, ఖర్జూరం, బెల్లం, వేరుశనగ చిక్కిలు, మూడు కేజీల రైస్, ఒక కేజీ కందిపప్పు, ఆఫ్ లీటరు ఆయిల్, 25 కోడిగుడ్లు, ఐదు లీటర్లు పాటు, ప్రతినెల గర్భవతులు, బాలింతల ఇళ్ళకు అంగన్‌వాడీ సెంటర్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీపీ మునివేలు తెలిపారు. ఈ ఆహారం ప్రతిరోజు గర్భవతులు, బాలింతలు తీసుకుని ఆరోగ్యపరమైన పిల్లలు పుట్టే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే నేసనూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో పుత్తూరు మండలం ఎంపీపీ మునివేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గర్భిణీలకు మన ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన టేక్ హోమ్ రేషన్‌లో ఇచ్చే వాటిని తగిన సమయంలో సరైన రీతిలో తుంచ తప్పకుండా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోవిందస్వామిరెడ్డి, సీడీపీవో పద్మజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గీతాంజలి, అనిత, పంచాయతీ కార్యదర్శి సుజాత, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైసీపీ నాయకులు దేవేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముని నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బళ్ళారి రాఘవ నాటక రంగానికి జీవం పోశారు

తిరుపతిలో ఘనంగా నివాళులర్పించిన రాయలసీమ రంగస్థలి

తిరుపతి (విద్య), ఆగస్టు 2, ప్రభాతవార్త



తెలుగు నాటక రంగాన్ని ప్రపంచ దేశాల్లో చాటి చెప్పిన నాటకరంగ పితామహుడు సంఘ సేవకుడు హరిజనోద్ధారకుడు పేదవారికి సహకారం అందించిన గొప్ప మహనీయుడు బళ్ళారి రాఘవ అని, రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపినాథ్ రెడ్డి పేర్కొన్నారు. బళ్ళారి రాఘవ 143వ జయంతి సందర్భంగా తిరుపతి రాయలసీమ రంగస్థలి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ రంగస్థలంపై నటించు కానీ జీవితంలో నటించకు అని కళాకారులకు నెల జీతాలు ఇచ్చి పోషించిన గొప్ప మహనీయుడు బళ్ళారి రాఘవ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, కార్యదర్శి కెఎన్ రాజా, విద్వాన్ కస్పా పద్మనాభన్, చంద్రబాబు నాయుడు, కె. సుబ్రమణ్యం రెడ్డి, కేశవులు రెడ్డి, సాంబోలు హరినాథ్, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనలపై నిరసన వ్యక్తం చేసిన శాంతి దూతలు...

రేణిగుంట, ఆగస్టు 2 ప్రభాతవార్త:



మణిపూర్‌లో జరుగుతున్న హింసలపై రేణిగుంట మండలంలోని అన్ని క్రైస్తవ సంఘాలు బుధవారం నిరసన వ్యక్తం చేస్తూ శాంతి ర్యాలీ చేశారు. దాదాపు 2000 మంది పైన క్రైస్తవులు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. మణిపూర్ రాష్ట్రంలో పరిస్థితులను ఖండిస్తూ ప్లేకార్డులను ప్రదర్శించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులను ఆయనకు వివరించారు. ఓ రాజ్యాంగ నిర్మాత నీవైన పాలకులకు బుద్ధి ప్రసాదించాలంటూ వేడుకున్నారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవ సంఘాల ఫాస్టర్లు, ఫాదర్లు, బిషప్‌లు మాట్లాడుతూ లౌకిక ప్రజాస్వామ్య దేశంలోని మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసను వ్యతిరేకించారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి శాంతిని నెలకొల్పాలన్నారు. బలహీనులపై బలవంతులు చేస్తున్న దాడులు అమానుష చర్యగా అభివర్ణించారు. శాంతి ర్యాలీలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ సూసైనాదన్ మైకిల్‌గా జెరూసలేం క్యాథలిక్ చర్చి ఫాస్టర్ చంద్రన్ డేవిడ్, సెయింట్ జాన్ లూథరన్ చర్చి ఫాస్టర్ విక్టర్ టెన్సింగ్, వివిధ చర్చిల ఫాస్టర్లు సతీష్, పుష్పరాజ్, రాజ్‌కుమార్, నత్తానియల్, డేనియల్, ఆశీర్వాదం, శామ్యూల్, నత్తానియల్, వైసీపీ సీనియర్ నాయకులు విశ్రాంత రైల్వే ఉద్యోగి జాన్‌బాబు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కమిటీ నాయకులు ఐజయ్య, రమణ, మండలంలోని వివిధ చర్చిల ఫాస్టర్లు, క్రీస్తు ప్రేమికులు, ఆర్‌సీఎం చర్చి మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటింటికి మీ బొజ్జల...

రేణిగుంట, ఆగస్టు 2 ప్రభాతవార్త:



ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితరెడ్డి టీడీపీ శ్రేణులతో కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లోనిపలు వీధుల్లో బుధవారం పర్యటించారు. తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యే, చంద్రబాబు ముఖ్యమంత్రిని చేస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటికి తిరిగిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు చంద్రరెడ్డి, మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లా నాయకుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, కరకంబాడి టీడీపీ నేతలు నగరి మునయ్య, బుజ్జినాయుడు, టీడీపీ సీనియర్ నేతలు సూరిబాబు, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగ అరెస్టు

## రూ. 39,550- ఒక మోటార్ సైకిల్, ఇసుప రాడ్డు స్వాధీనం



తిరుపతి క్రైం, ఆగస్టు 2 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ మండల పరిధిలోని కొత్త చెర్లోపల్లి గ్రామంలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో జులై 11వ తేది రాత్రి ఎవరో గుర్తు తెలియని దొంగలు ఆలయ ద్వారానికి గల బీగాలు పగలగొట్టి హుండీలోని రూ. 57,000 డబ్బులు, ఒక డివిఆర్ బాక్స్‌ను దొంగిలించుకుని వెళ్ళారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐ ఆర్ వినోద్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు సుబ్రమణ్యం రెడ్డి సూచనల మేరకు దర్యాప్తును కొనసాగించిన ఎస్ఐ వినోద్ కుమార్ బుధవారం 12.30 కాలూరు క్రాస్ వద్ద ఎస్ఐ వినోద్ కుమార్ వారి సిబ్బందితో అనుమానితుని పట్టుకుని విచారించగా అతను తమిళనాడు రాష్ట్రం నాగర్ కోయిల్ జిల్లా, కన్యాకుమారికి చెందిన ఉమేష్ ధీరజ్ కుమారుడు ఉమేష్‌గా తెలిసింది. అతడు విలాసాలకు అలవాటు పడి, కావాల్సిన డబ్బుల కోసం తన తండ్రితో కలసి మోటార్ సైకిల్ పై వచ్చి, ఇద్దరూ కలిసి పై ఆలయంలో దొంగతనం చేసినట్లు అంగీకరించారు. అతడు తన తండ్రి, తమ్ముళ్లతో కలిసి గతంలో తమిళనాడు రాష్ట్రంలోని పలు ఆలయాల్లో దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. మరలా దొంగతనం చేయుటకు మోటార్ సైకిల్ పై వెళుతుండగా పోలీసులు అతడిని అరెస్టు చేసి అతడి వద్ద నుండి చోరీ సొత్తు 39550 రూపాయిలు దొంగతనానికి ఉపయోగించిన ఒక హీరో గ్లామర్ మోటార్ సైకిల్‌ను ఒక ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. డివిఆర్ బాక్స్‌ను రాయితో పగులగొట్టి దారిలో పడవేసినట్లు, తన తండ్రి ఉమేష్ పరారీలో ఉన్నట్లు అంగీకరించాడు. పై వరుస దొంగతనం కేసును ఛేధించడంలో కృషి చేసిన ఎస్ఐ, సిబ్బందిని తిరుపతి జిల్లా ఎస్పి అభినందించారు.

## ఆడికృత్తిక మహోత్సవాలు గోడపత్రికల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలోనూ, అనుబంధంగా వెలసిన విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఈ నెల 4నుంచి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.ఈ నేపథ్యంలో బుధవారం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద గోడపత్రికలను ఆవిష్కరించారు.గోడపత్రికలను శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆవిష్కరించారు. ఆలయంలో ఉత్సవాలను బారీ ఎత్తున నిర్వహించటం జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే ఉత్సవాలలో అధికారులు జవాబుదారి తనంతో వ్యవహారించాలని ఎంఎల్ఏ పిలుపు నిచ్చారు.ఈ నెల 4న అంకురార్పణ,5న ధ్వజారోహణ, 6న రెండు తిరునాళ్ళు, 7న మూడవ తిరునాళ్ళు, 8న నాలగవ తిరునాళ్ళు భరణి 9న ఆడికృత్తిక 10 తెప్పోత్సవం, రాత్రి కళ్యాణోత్సవం12న పార్వేట,13న వసంతోత్సవం 14న పల్లకి సేవను నిర్వహించనున్నారు. అవిష్కరణ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ ఇఒ కెవి సాగర్‌బాబు,సభ్యులు రమాప్రభ, సుమతి,లక్ష్మీ,బుల్లెట్ జ్యయశ్యాం, మున్నారాయల్, కొండూరు సునీత, మల్లికార్జున్‌రెడ్డి, చింతామణి పాండు నంద,జూలుగంటి సుబ్బారావు,ఎంపి శ్రీదేవి,సుబ్బరాయులు అలయ ప్రదానార్చకులు సంబంధంగురుకుల్, కరుణాకర్ గురుకుల్, పారోహితులు అర్ధగిరి స్వామి ఎఇఓ లోకేష్‌రెడ్డి,ఇఇ నూకారత్నం, ఎఇఓ సతీష్‌మాలిక్,ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల ప్రకారం గిరిజన విద్యార్థులకు టిటిడి విద్యాసంస్థల్లో ప్రవేశం కల్పించండి

**-ఆర్ఒఆర్ ప్రకారం నిరుద్యోగ యువతకు ఉపాధి -షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్**



తిరుమల,ఆగస్టు 2ప్రభాతవార్తప్రతినిధి: ధార్మిక సంస్థ టిటిడి నడుపుతున్న విద్యాసంస్థల్లో గిరిజన విద్యార్థులకు రిజర్వేషన్ల ప్రకారం ప్రవేశాలు కల్పించాలని, ఆర్ఒఆర్ ప్రకారం గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు కూడా ఆర్ఓఆర్ నిర్వహించేందుకు తగిన ఆదేశాలు జారీచేయాలని కోరారు. బుధవారం సాయంత్రం టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డిని పరిపాలన భవనంలో వడిత్యాశంకర్ నాయక్ కలిశారు. ఈ సందర్భంగా టిటిడి ఇతోధిక సేవలను, ఇఒ పనితీరును అభినందించారు. అనంతరం టిటిడి విద్యాసంస్థలు, వసతి గృహాలు,ఉపాదికి సంబంధించి గిరిజనులకు మంచి అవకాశం కల్పించడం, టిటిడిలో బ్యాక్‌లాగ్ భర్తీలు తదితర అంశాలపై ఇఒ ధర్మారెడ్డితో చర్చించారు.

## ఘనంగా కల్యాణ వేంకటేశ్వరుని శ్రవణ ఉత్సవం



నారాయణవనం, ఆగస్టు 2 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయం బుధవారం శ్రవణం ఉత్సవంతో ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవారిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్పెక్టర్ భరత్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రొట్టల పండుగకు వెళ్ళి..గంగ కాలువలో పడి మృతి



తొట్టంబేడు, ఆగస్టు 2 ప్రభాతవార్త : నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు వెళ్ళి గంగ కాలువలో పడి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. టుటౌన్ ఎస్ఐ మహేష్‌బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుపలోని జీవకోన గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న ఎస్.కె.సులేమాన్ కుమారుడు ఎస్.కె.మహ్మద్‌అలీ(38) తన మిత్రులతో కలసి నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ కార్యక్రమానికి వెళ్తుండగా మార్గమధ్యలో వెంకటగిరి సమీపంలోని బంగారుపేట వద్ద బాత్‌రూంకోసం దిగి తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్ళగా కాలుజారికాలువలో పడిపోవడంతో బుధవారం పెద్దశింగమాల బ్రిడ్డి వద్ద మృతదేహం తెలుతుండడంతో గమనించిన స్థానికులు టుటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ మహేష్‌బాబు, హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్, సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులకు సమాచారాన్ని అందించారు. మృతుడు జీవకోనలోని ఓ చికెన్‌షాపులో పనిచేస్తున్నట్లు సమాచారం.

## వైభవంగా దీపపు పూజ



నగరి, ఆగస్టు 2 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి చింతలపట్టెడ ద్రౌపదీ సమేత ధర్మ రాజుల ఆలయంలో నిర్వహిస్తున్న తిరుణాళ్ళలో భాగంగా బుధవారం దీపపు పూజ వైభవంగా నిర్వహించారు. 750 మంది మహిళలు దీపాలతో ఊరేగింపుగా వచ్చి ధర్మరాజుల స్వామి ఆలయంలోకి రావడం ప్రత్యేకత సంతరించుకుంది. ఆలయ ఉత్సవ మండపం వద్ద అధిక సంఖ్యలో ఆశీనులైన మహిళలు ఉత్సవ నిర్వాహకులు అందించిన అమ్మవారి చిత్రపటాల ముందు దీపాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. దీపపు పూజల అనంతరం భక్తులకు ఆలయ నిర్వామకులు కుంకుమ ప్రసాదాలు అందించారు. ఉత్సవ నిర్వాహకులు డా. నటరాజన్, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే చంద్రమౌళీశ్వర ఆలయంలో ఆడిపూజను పురస్కరించుకుని దీపపు పూజను నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. శివగామిదేవి చిత్రపటాన్ని ఉంచి దీపాలను వెలిగించి పుష్పార్చనలు చేశారు. పూజలకు హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు జలగండా సుబ్రహ్మణ్యం ప్రసాదాలు అందజేశారు.

## వైభవంగా యాగాతమ్మ తిరుణాళ్లు



నగరి, ఆగస్టు 2 ప్రభాతవార్త: మండలంలోని మాంగాడు గ్రామంలో యాగాతమ్మ బుధవారం యాగాతమ్మ ఆలయం వద్ద తిరుణాళ్ళ ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలో యాగాతమ్మను అలంకరించి ఉంచారు. మంత్రి రోజా ఉదయం యాగాతమ్మ తిరుణాళ్ళకు హాజరయ్యారు. ఆమెకు గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు పూల వర్షంతో ఘనంగా స్వాగతం పలికారు. యాగాతమ్మను దర్శించుకున్న మంత్రి అర్చనలు చేయించుకుని ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఢిల్లీ, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, సర్పంచ్ నరసింహులు, నాయకులు శ్రీనివాసులురెడ్డి, గోవిందరెడ్డి, సురేష్, నాగయ్య నాయుడు, దామునాయుడు, శ్రీనివాసరాజు, జ్యోతి, శేఖర్ వర్మ, బాలాజీలు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం : ఎంపిడిఓ



కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కోట మండలంలో విజయవంతంగా నిర్వహించామని ఎంపిడిఓ మారెళ్ల భవాని చెప్పారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి తెలుసో తెలియకో ప్రభుత్వ పథకాలను పొందని వారిని గుర్తించి ఆ కుటుంబాలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించాలన్న ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. జూలై నెలలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం సచివాలయాల పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి అధికారులు ముందుగానే వెళ్లి వారికి కావలసిన సేవలను, ఇంకా ఏమైనా అవసరమా గుర్తించి సుమోటాగా వలంటీర్ల ద్వారా దరఖాస్తులు పెట్టుకోవాలన్నారు. కుటుంబ, కులం, ఆదాయం, మరణ, జనన, హౌసింగ్ తదితర 11 రకాల సర్టిఫికెట్లు 16 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అందజేసినట్లు తెలిపారు. ఈ 11 రకాల సేవలను ఎలాంటి సర్వీసు ఛార్జిలు లేకుండా ఉచితంగా అందజేశామని తెలిపారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశామని తెలిపారు. మరొక బృందం తహశీల్దార్ పదానమవతి కూడా ఆయా సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై ఆర్‌డిఓతో సమావేశం



వాకాడు, ఆగస్టు 2, ప్రభాత వార్త : మండల పరిధిలోని పలు భూ సమస్యలపై గూడూరు ఆర్డివో కిరణ్ కుమార్‌తో సీనియర్ రాజకీయ నాయకుడు, వాకాడు సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి బుధవారం చర్చించారు. ఆర్డిఓ కిరణ్ కుమార్ వాకాడుకు రాగా, ఎంపిపి కార్యాలయంలో సమావేశమై పలు భూ సమస్యలపై చర్చ జరిగాయి. ప్రధానంగా దుగరాజపట్నం సప్లై ఛానల్ కాలువ నిర్మాణంకు చెందిన భూములు పరిహారం పై, పూర్తయిన వెంటనే సప్లై ఛానల్ కాలువ నిర్మాణం జరిగేలా చూడాలని ఆయన్ని నాయకులు కోరారు. తెలుగు గంగ కాలువ తదితర సమస్యలపై చర్చలు నిర్వహించారు. ఈ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబందిత అధికారులతో ఆర్డిఓ మాట్లాడుతూ వాకాడు తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసారు. అదే విధంగా మండలంలోని మిగులు భూములను రెండో విడతలో పేదలకు భూ పంపిణీ చేయాలని ఆర్డివోకు దామోదర్ రెడ్డి సూచించారు. ఆ పనులను కూడా వెంటనే చేపట్టాలని తహశీల్దార్‌కు సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ గోపినాద్, డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, వాకాడు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరు సర్పంచి దువ్వూరు విజయ భాస్కర్ రెడ్డి, వైకాపా నాయకులు ప్రదీప్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు తల్లిపాలు అమృతంతో సమానం

**- పిఇఎస్ ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య**



కుప్పం, ఆగస్టు 2 ప్రభాత వార్త : పిల్లలకు తల్లిపాలు అమృతంతో సమానమని పిఇఎస్ ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య పేర్కొన్నారు. బుధవారం ఆస్పత్రిలో తల్లిపాల వారోత్స వాలను ఎంఎస్ డా॥సుబ్రమణ్య, చిన్నపిల్లల హెచ్ఓడి డా॥ రాజేంద్రనాయుడు, ప్రొఫెసర్ డా॥హరీష్ చంద్రన్, ప్రసూతి విభాగాధిపతి డా॥ ప్రదీప్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడి డా॥చిత్ర నాగరాజు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలకు తల్లిపాలు ఇచ్చే ప్రాధాన్యత తగ్గిందని పేర్కొన్నారు. దీంతో పిల్లల ఎదుగుదల తగ్గుతోందన్నారు. ప్రతి తల్లి పిల్లలకు కాన్పు అయిన అర్ధగంటలోగా తల్లిపాలు అందించకుంటే పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నా యన్నారు. తల్లిపాలు పిల్లలకు అమృతంతో సమానమన్నారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వడంతో వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందన్నారు. వైద్య విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పిఇఎస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ఈనెల 7వతేది వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి:బియ్యపు పవిత్రారెడ్డి



తొట్టంబేడు, ఆగస్టు 2 ప్రభాతవార్త : వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ తనయ బియ్యపు పవిత్రా రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బసవయ్యపాళెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద శ్రీకాళహస్తి ప్రాజెక్టు పరిధిలో ఉన్న 208 అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్ఆర్ సంపూర్ణపోషణ పథకం ద్వారా గర్భిణీస్త్రీలకు బాలింతలకు అందించే పోషకాహారాన్ని 'టేక్ హోం రేషన్' ద్వారా ఇంటి వద్దకే సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని బియ్యపు పవిత్రారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల కన్వీనర్, సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, సర్పంచ్ తోటకూరనాగమణి, వైస్ ఎంపిపి గరటారెడ్డిలు విచ్చేశారు. కార్యక్రమా నికి సిడిపిఓ శాంతిదుర్గ అధ్యక్షత వహించారు. అనంతరం పవిత్రారెడ్డి మాట్లాడుతూ గర్భిణీస్త్రీలకు, బాలింతలకు అందించే పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న వారికి అంగన్‌వాడీ టీచర్లు నేరుగా ఇంటికి చేర్చాలన్నారు. ఇందులో భాగంగా 10రకాల సరుకులు ఉంటాయని, ఒక్క గర్భవతికి మరియు బాలింతలకు, పిల్లలకు ఈపోషకాహారం ఇంటింటికి పంపించడం జరుగుతుందన్నారు. మండల సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అంతేకాకుండా గర్భవతులు, బాలింతలకు, చిన్నారులకు ఏప్రభుత్వం ఇవ్వని విధంగా పౌష్టికాహారం ఇస్తోందని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిడిపిఓ శాంతిదుర్గ మాట్లాడుతూ ఈ పథకంలో ఎలాంటి అవకతవకలకు చోటులేకుండా మొబైల్‌యాప్స్ ఉపయోగించు కుంటున్నామని ప్రతి ఒక్క లబ్దిదారునికి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్‌హోం రేషన్ ద్వారా అందిస్తామని తెలిపారు. అనంతరం గర్భవతులకు సీమంతాలు చేయడంతో పాటు పోషకాహారాన్ని పంపిణీచేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఆశీర్వాద మహా మండపంకు పూజా కార్యక్రమం

**ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి**



తిరుపతి కార్పొరేషన్, ఆగష్టు 2, ప్రభాతవార్త : తిరుపతిలోని శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఆశీర్వాద మహా మండపంకు సంబంధించిన మొదటి స్టోన్ పూజ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ దేవస్ధానంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు భాగంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, గంగమ్మ గుడి చైర్మన్ కట్టగోపి యాదవ్, ఆలయ అర్చకుల ద్వారా ఆశీర్వాద మహా మండపంకు సంబంధించి మొదటి స్టోన్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి త్వరగా పూర్తి చేసిన ఆశీర్వాదం మండపాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకుని వస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, చైర్మన్ కట్టగోపి యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు చైర్మన్ వారికి తీర్ధ ప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు దొడ్డరెడ్డి సిద్దారెడ్డి, పాలగిరి ప్రతాప్ రెడ్డి, నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె బాబు, కార్పొరేటర్ ఆంజనేయులు, ధర్మకర్తల మండలి వెంకటేశ్వరరావు, ధనశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్లు...పట్టించుకోని అధికారులు



శ్రీకాళహస్తి,ఆగస్టు 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి లోని ఆర్అండ్‌బి రోడ్డు గుంతలమయంగా మారింది. కానీ సంబంధిత శాఖ పట్టించుకోవటం లేదని జనం అసంతృప్తి చెందుతున్నారు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి లోని ఆర్అండ్ బి రోడ్ల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి తిరుపతి నుంచి వచ్చే వాహనాలకు ఏపీసీడ్స్ ముఖద్వారం వద్ద రోడ్డు అధ్వాన్నంగా మారింది. పగలు, రాత్రి వేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురౌతున్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయనికి విచ్చేయు భక్తులకు ఇది మరింత ఏక్కవగా వుంది. ఎక్కడ ఏ గుంత పడినా ఆర్అండ్‌బి అధికారులకు గుంతలు కనబడినా నిధుల కొరత వెంటాతున్నట్లు వుంది. అయితే దేవస్థానం అయినా కనీసం గతుకులకు అతుకులు వేయాసిన బాధ్యత వుంది, వారు పట్టించుకోవటం లేదు. సమీపంలో ఉన్న వారు, పోలీసులు గుంతలకు మట్టి పోస్తున్నారు. కానీ అది ఒక్క రోజు కూడా నిలవటం లేదు.ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

## గణిత ఒలంపియాడ్ చాలెంజ్‌లో వెండి పతకం

**విద్యార్థి అనిరుద్ధ శ్రీరామ్ రాజాను సన్మానించిన జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి**



తిరుపతి క్రైం, ఆగస్టు 2 ప్రభాతవార్త : సింగపూర్ నందు జులై 27వ తేది జరిగిన అంతర్జాతీయ గణిత ఒలంపియాడ్ చాలెంజ్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి వెండి పతకం సాధించి, అంతర్జాతీయ వేదిక పై చిన్న వయసులోనే తెలుగు వాడి సత్తాను చాటిన విద్యార్ధి అనిరుద్ధ శ్రీరామ్ రాజాను తన తల్లిదండ్రుల సమక్షంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో తిరుపతి జిల్లా పరమేశ్వర రెడ్డి శాలువతో ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ చదువు వజ్రం లాంటిది వజ్రాన్ని ఎంత పదును పెడతామో అంత మెరుస్తుందన్నారు. అలాగే పిల్లలు చదువును ఎంత చదువుతారో అంత పదునైన జ్ఞానాన్ని పొందవచ్చు అని ఈ విషయంలో అనిరుద్ధ శ్రీరామ్ రాజా ఆసక్తిని గుర్తించిన అతని తల్లిదండ్రులు సాకేత్ రామ్, అంజన శ్రావణి ఆ విధంగా పదును పెట్టి ప్రోత్సహించారు. పర్యవసానంగా ఆ పిల్లవాడు జులై 27వ తేదిన సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి వెండి పథకాన్ని సాధించి ముప్పన్నెల జెండాను రెపరెపలాడించారన్నారు. విద్యార్ధి అనిరుద్ధ శ్రీరామ్ రాజా, అతని తల్లిదండ్రులు తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## రేణిగుంటలో బంగారు కుసుమాలు



రేణిగుంట, ఆగస్టు 2 ప్రభాతవార్త: రేణిగుంట బాలికల ప్లస్‌టు ఉన్నత పాఠశాల బాలికలు రాష్ట్రస్థాయిలోజరిగిన గ్రాబ్లింగ్, రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో 18 బంగారు, 6 వెండి, 3 కాంస్య పథకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్లుగా నిలిచారు. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థినులు సంజన 2 బంగారు పతకాలు, స్వాతి 2 బంగారు పతకాలు, భారతి 2 బంగారు పతకాలు, మొదటి సంవత్సరం విద్యార్థినులు రాజా, రాజేశ్వరి, పదో తరగతి విద్యార్థిని ఉమామహేశ్వరి రెండేసి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులు మణి మేఘల, సౌమ్య, 9వ తరగతి విద్యార్థినులు ఉషశ్రీ, 7వ తరగతి విద్యార్థిని వర్షిత, భార్గవి, 6వ తరగతి విద్యార్థిని అనూష ఒక్కొక్క బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. 9వ తరగతి విద్యార్థినులు సరస్వతి, రమ్య, గ్రాసి, 8వ తరగతి విద్యార్థిని యశస్విని, 7వ తరగతి విద్యార్థిని శ్రీవల్లి, వెండి పతకాలను గెలుచుకున్నారు. పదో తరగతి విద్యార్థినులు సంగీత, సుచిత్ర, 7వ తరగతి విద్యార్థిని పూజిత కాంస్య పతకాలను దక్కించుకున్నారు. పదో తరగతి విద్యార్థిని మణి మేఘల బంగారు పథకంతో పాటు రజిత పతకాన్ని గెలుచుకుంది. ఓవర్ ఛాంపియన్‌షిప్ తెచ్చిన విద్యార్థినులను పాఠశాల ప్రధానాచార్యులు విష్ణువర్ధని, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, పుర ప్రముఖులు అభినందించారు.

## చంద్రబాబు బహిరంగసభ ఏర్పాట్లు పరిశీలన



శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలో ఈనెల 5వతేదీ శనివారం తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రానున్నారు. స్థానిక బేరివారి మండపం వద్ద మద్యాహ్నం 12గంటలకు బహిరంగసభ ఉంటుంది. బుధవారం బహిరంగసభకు సంబందించి ఏర్పాట్లును నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి పరిశీలించారు. బేరివారి మండపం వద్ద బహిరంగసభను సుమారు 50వేలమందితో నిర్వహించనున్నారు. సభాస్థలి పరిశీలనలో చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రతినిధి రవి, రాబిన్‌శర్మ టీం లీడర్‌లతో పాటు పాలసరఫరా మాజీ చైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో ప్రాజెక్టుల పరిశీలనకు వస్తున్న చంద్రబాబునాయుడు శ్రీకాళహస్తికి రావడం ఎంతో సంతోషంగా ఉందని నియోకవర్గంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల పరిశీలన, అక్కడి రైతులు, స్థానికులతో సమావేశాలు ఉంటాయని అనంతరం పట్టణంలోని బేరివారి మండపం వద్ద భారీ బహిరంగసభ ఉంటుందన్నారు. దీనికి ముందు ఆయనకు ఎపిసీడ్స్ కూడలి నుంచి ద్విచక్రవాహనాల ర్యాలీతో స్వాగతం పలకడంతో పాటు రోడ్‌షో ఉంటుందన్నారు.